క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు ఆదివారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా అమ్మవారి దేవస్థానంలో ఉదయం 11 గంటల నుంచి ఆలయ కమిటీ నేతృత్వంలో అన్నప్రసాద వితరణ చేశారు.

రూ.3 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: మండలంలోని పాలవలసలో రూ.3లక్షలతో సీసీ రోడ్డు, కాలువ నిర్మాణానికి ఎంపీపీ పొట్నూరు ప్రమీల ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, బూర్లె శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.

రూ.3.20 లక్షలతో తాగు నీటి బోర్ల ఏర్పాటు


తాండ్రంగిలో చేపడుతున్న బోరు డ్రిల్లింగ్ పనులు

జామి: మండలంలోని తాండ్రంగి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.3.20 లక్షలతో నాలుగు తాగునీటి బోర్ల డ్రిల్లింగ్ పనులను సర్పంచ్ కరక వందన, ఎంపీటీసీ వి. కృష్ణవేణి ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి మండల పరిషత్ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ నిధులతో గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు నాలుగు బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామపెద్దలు కరక భశరద తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా డస్ట్‌బిన్‌లు


ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న చెత్త సేకరణ బుట్టలు

వేపాడ: మండలంలో ఇంటింటికీ చెత్తసేకరణ బుట్టలు అందజేయనున్నామని ఎంపీపీ సత్యవంతుడు ఆదివారం తెలిపారు. జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా మండలంలోని 29 పంచాయతీల్లో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 19 వేల చెత్తసేకరణ బుట్టలను సరఫరా చేసిందని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో వీటిని భద్రపరిచామని, త్వరలో పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తామని పేర్కొన్నారు. వీటిని సర్పంచ్‌లు ఇంటింటికీ అందజేయాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు అందించేలా ప్రజలకు సర్పంచ్‌లు అవగాహన కల్పించాలని కోరారు.

హిందూ ధర్మం ఆచరణీయం


ధార్మికోపన్యాసం చేస్తున్న బాబూరావు మాస్టారు

శృంగవరపుకోట: హిందూ ధర్మం ఆచరణీయమైనదని ధర్మవరం బాబూరావు మాస్టారు అన్నారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా స్థానిక ధారగంగమ్మ ఆలయంలో ఆయన ఆదివారం ధార్మికోపన్యాసం చేశారు. హైందవ ధర్మం విశిష్టత, విలువలను వివరించారు. అనాది నుంచి నేటి వరకూ అందరూ ఆచరించదగ్గది హైందవధర్మమని చెప్పారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

పల్లె చెంతకు పాలన

- సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాకారం
- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య


గంట్యాడ: పెదమజ్జిపాలెంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

గంట్యాడ/ బొండపల్లి: గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేశా రని, పల్లె చెంతకు ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గంట్యాడ మండలంలోని పెద మజ్జిపాలెంలో సచివాలయ నూతన భవనాన్ని, బొండపల్లి మండలంలోని దేవుపల్లి, కనిమెరక గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నూతన భవనాల ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో పరిపాలన సులభతరం అయిందని తెలిపారు. ప్రభుత్వ సేవల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పని తప్పిందని అన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, సదరం స్లాట్ బుకింగ్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్లు తదితర 500కు పైగా సేవలు సచివాలయా ల్లోనే లభిస్తున్నాయని చెప్పారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ అన్నీ ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి, ప్రజలకు సేవలన్నీ ఒకే చోట అందేవిధంగా సీఎం జగన్ ముందు చూపుతో తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇస్తోందన్నారు.


బొండపల్లి: దేవుపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

అవినీతి రహిత పాలన

ప్రభుత్వ సేవలు, పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయని ఎమ్మెల్యే అప్పలనరసయ్య అన్నారు. పార్టీల కతీతంగా అర్హులకు పథకాలను మంజూరు చేస్తున్నామని, అవినీతి రహిత పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం జన్మ భూమి కమిటీలు, టీడీపీ నాయకులకు లంచాలు ఇవ్వనిదే ప్రజలకు అందేవి కాదని గుర్తు చేశారు. పెదమజ్జిపాలెంలో ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామంలో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు జలజీవన్ మిషన్ పథకం నుంచి రూ.60 లక్షలు మంజూ రయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని వాటిని సరిచేయాలని గ్రామస్తులు కోరాగా... స్తంభాల ను సరిచేయాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న కుమార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. పెద్దమజ్జిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, గంట్యాడ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధిరామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, పెదమజ్జిపాలెం సర్పంచ్ కొంచా డ సన్యాసినాయుడు, ఎంపీటీసీ ఎర్ర అప్పారావు, గింజేరు సర్పంచ్ రాజాన సూరిబాబు, ఎంపీటీసీ చప్ప ఊహ, తామరపల్లి సర్పంచ్ కొడెల ముత్యాలనాయుడు, నాయకులు ప్రభూజీ, రంభ సత్యారావు, దేవుపల్లి, కనిమెరక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీరాజు, బొండపల్లి ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ రాజ్ జేఈఈ కె.కృష్ణమూర్తి, కనిమెరక సర్పంచ్ ఎస్.ఆదినారాయణ,దేవుపల్లి ఎంపీటీసీ రాపాక వెంకటలక్ష్మి, నాయకులు మీసాల తులసీరాం బోడసింగి జగదీశ్వరరావు,కర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు


లక్కవరపుకోట: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వ హించనున్నట్లు ఎంపీడీఓ బి.జ్ఞానేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సూర్యారావు

శృంగవరపుకోట: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో వార్డెన్ సత్యనారాయణ అధ్యక్షతన సమాచార హక్కు చట్టం పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కుచట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు అతిథిగా హాజరై, చట్టం గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 18 ఏళ్లు అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయా ల్లో ఫోర్ వన్(బి), పీఐఓ, ఏపీఐఓ అప్పీలేట్ అధారిటీ బోర్డులు లేకపోవడం బాధాకరమన్నారు. యువత సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


రాంబాబును సన్మానిస్తున్న ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు, పోలీస్ సిబ్బంది

గంట్యాడ: అంకిత భావంతో పనిచేసే ఏ ఉద్యోగికి అయినా తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు అన్నారు. గంట్యాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఏఎస్ఐ రాంబాబుకు విజయనగరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయింది. ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం పేరిట స్టేషన్ సిబ్బంది ఏఎస్ఐను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ రాంబాబు చిత్త శుద్ధితో పనిచేసే వారని, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా నడుచుకునే వారని ఎస్ఐ చెప్పారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈకి సన్మానం


ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడిరాజును సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల సర్పంచ్‌లు

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.ఆర్.వి.పైడిరాజును మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. లక్కవరపుకోట సబ్ డివిజన్ పరిధి గ్రామాల్లో శాఖాపరంగా డీఈఈ పైడిరాజు అందించిన సేవలతో పాటు, జిల్లా స్థాయిలో ఉత్తమ డీఈఈగా ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయన్ని సన్మానించామని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు తెలిపారు. అతిథులుగా హాజరైన ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పా రావు మాట్లాడుతూ గతంలో వేపాడ మండలంలో ఏఈగా పైడిరాజు పదేళ్లు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సేవలందించార న్నారు. ఏఈగా ఏవిధంగా సమన్వయంతో సేవలందించారో.. డీఈఈగా కూడా వేపాడ మండల అభివృద్ధికి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాపరంగా సహ కారం అందించాలని సర్పంచ్‌లు కోరారు. సన్మాన గ్రహీత సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ


రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న వైద్యురాలు ఛండీప్రియ

చీపురుపల్లి: దీర్ఘకాలిక వ్యాధులతో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న 20 మందికి సహృదయ ఫౌండేషన్(యూఎస్ఏ) వ్యవ స్థాపకురాలు తాడివాక బిందు పౌష్టికాహార కిట్లను సమకూర్చారు. ఆ సంస్థ తరపున ఆశయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు ఛండీప్రియ రోగులకు పౌష్టికాహార కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.700 విలువైన బెల్లం, కందిపప్పు, గోధుమపిండి, రాగులు, వేరు శనగ పలుకులు, పెసలు, సబ్బులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రత తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, సభ్యులు మీసాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

గొట్లాం, కళ్లేపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరాలు

బొండపల్లి/ లక్కవరపుకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బొండపల్లి మండలంలోని గొట్లాం, ఎల్.కోట మండలంలోని కళ్లేపల్లి గ్రామ సచివాలయాల్లో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు వై.వి.రాజేంద్రప్రసాద్, జ్ఞానేశ్వరరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారని, సచివాలయాల పరిధి ప్రజలు వైద్య శిబిరానికి తరలివచ్చి వైద్యసేవలను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు. కళ్లేపల్లిలో నిర్వహించే శిబిరానికి వచ్చేందుకు ఆ సచివాలయ పరిధిలోని శివారు గ్రామాలైన సీతాగౌర్లైవానిపాలెం, పూడివానిపాలెం ప్రజలకు ఆటో సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో 'స్పందన'

దత్తిరాజేరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని, మండల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

గీతామందిరంలో శివానందలహరి

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడివీధిలోని గీతామందిరంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి శివానందలహరి వేదాంత ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గీతాసత్సంగ్ సేవా సమితి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ దార్లపూడి నరసింహాశర్మ నేతృత్వంలో శివానందలహరి ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


వృద్ధులకు సేవ చేయడం అభినందనీయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


వృద్ధాశ్రమంలో టీవీ రూమ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల కుసుమహర్‌నాథ్ క్షేత్రంలోని వృద్ధాశ్రమంలో ఎస్‌సీఎస్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ట్రస్ట్ సమకూర్చిన టీవీ రూమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, అమెరికా వాస్తవ్యులు వృద్ధులకు 75 ఇంచీల టీవీని, సౌకర్యవంతమైన 40 కుర్చీలను సమకూర్చారన్నారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బాలాజీ, ఎస్‌సీఎస్ ట్రస్ట్ చైర్మన్ నారాయణం శ్రీనివాసరావు మాట్లాడుతూ, కుసుమహర్‌నాథ్ క్షేత్రంలో వృద్ధులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో టీవీ రూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉడతా కాశీ విశ్వనాథం, ఉసిరికాల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామతీర్థంలో పవిత్రోత్సవాలు


రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను దేవస్థాన అధికారులు పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు పవిత్రోత్సవ పూజలకు ఆలయ అర్చకులు అంకురార్పణ చేయనున్నారు. 10న శ్రీ మద్రామాయణ పారాయణాలు, సుందరాకాండ పారాయాణాలు, దివ్య ప్రబంధ సేవా కాలములు, యాగశాలలో అకల్మష హోమాలు, పవిత్ర శుద్ధి, పంచశయనాధివాసం, సర్వదేవతామూర్తి హోమాలు జరిపించనున్నారు. 11న ప్రత్యేక పూజలనంతరం సీతారామస్వామికి ప్రధాన ఘట్టమైన పవిత్ర సమర్పణ.. 12న శ్రీరాముడికి పట్టాభిషేకం నిర్వహిస్తామని ఈఓ కిశోర్‌కుమార్ తెలిపారు.

పార్టీ ప్రతినిధుల సభకు విజయవాడ పయనం


శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విజయవాడకు పయనమైన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రవిబాబు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన విజయవాడలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభకు ఎస్.కోట నియోజకవర్గ నేతలు ఆదివారం తరలి వెళ్లారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అయిదు మండలాలకు చెందిన 40 మంది పార్టీ ప్రతినిధులను వెంటబెట్టుకుని విజయవాడకు రోడ్డు మార్గంలో పయనమయ్యారు. ఎమ్మెల్యేతో కలిసి ఎమ్మెల్సీ కుంభా రవి బాబు, రాష్ట్ర కొప్పెల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు వెళ్లారు.

దత్తిరాజేరు మండలం నుంచి...


దత్తిరాజేరు: పెదమానాపురం నుంచి తరలి వెళుతున్న దత్తిరాజేరు మండల నాయకులు

దత్తిరాజేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన విజయవాడలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభకు మండలానికి చెందిన ముఖ్య నేతలు ఆదివారం తరలివెళ్లారు.ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి తదితర నేతలు పెదమానాపురం నుంచి కారులో పయనమయ్యారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా గురువులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): నిత్యం యోగా చేయ డం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, కొండపాలెం మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.ప్రమీల అన్నారు. గరివిడి పట్టణంలోని వాసవీ నిత్యనిర్మల యోగా పీఠం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించా రు. యోగా గురువు కనకేశ్వరరా వు, సత్యశ్రీనివాస్‌ను అతిథులు జెడ్పీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రమీల సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లుగా వాసవీ నిత్యనిర్మల యోగా పీఠం ద్వారా ఎంతో మందికి ఉచితంగా యోగా శిక్షణ ఇస్తుండడం అభినందనీయమన్నారు. మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ బమ్మిడి కార్తీక్, బ్రహ్మకుమారీస్ కేంద్ర ఇన్‌చార్జి లతక్క, పట్టణ ప్రముఖులు డి.శంకర్‌లాల్‌శర్మ, బలగం వెంకటరావు, మురళీ, షఫర్‌ఖాన్, వి.వి.ఎస్.ఎస్.గుప్త తదితరులు పాల్గొన్నారు.

రూ.78 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ


ఆతవ గ్రామ రోడ్డులో పూర్తయిన మెటల్ వర్క్

వేపాడ: సోంపురం-వేపాడ ప్రధాన రహదారిని అనుసంధానించే ఆతవ గ్రామ రోడ్డును రూ.78 లక్షలతో పునరుద్ధరిస్తున్నట్లు పంచాయ తీరాజ్ ఏఈ మానస తెలిపారు. సుమారు 2.5 కిలోమీటర్ల తారురోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో పునరుద్ధరణకు ప్రభుత్వం ఏఎంసీ నిధులు రూ.78 లక్షలు మంజూరు చేసిందని ఏఈ చెప్పారు. రోడ్డు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి.మెటల్, క్రషర్ బుగ్గి వేశారు. 2.5 కిలోమీటర్ల రోడ్డు పరిధిలో రెండు చోట్ల పొలాల మధ్య కల్వర్టులు నిర్మించాల్సి ఉందని, వరి పంట ఉన్నందున వాటి నిర్మాణం కొంతమేర ఆలస్యమైందన్నారు. త్వరలోనే కల్వర్టుల నిర్మాణం పూర్తి చేసి, తారుపూత వేస్తామని ఏఈ తెలిపారు.

మట్టి సేకరణ


వల్లంపూడిలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

వేపాడ: నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 20 గ్రామాల్లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి మట్టిసేకరించామని మండల బీజేపీ అధ్యక్షుడు గోకేడ మహేష్ తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా జీవితాలను త్యాగం చేసిన అమరవీరులను కన్నభూమికి గొప్పగౌరవాన్ని అందించేందుకు ప్రధానీ మోడీ సంకల్పం మేరకు మట్టి సేకరిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపిస్తామ ని తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు యలమంచిలి ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్


రక్తదానం చేస్తున్న యువతి

విజయనగరం ఫోర్ట్: యువత రక్తదానానికి ముందుకు రావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో తలసేమియా రోగుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తలసేమియా రోగులకు 15 నుంచి 21 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందన్నారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని తెలిపారు. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి కాపాడగలడని చెప్పారు. కార్యక్రమంలో శ్రేయరెడ్డి , శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.